క్లుప్తంగా

ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డికి రివార్డు



రివార్డు అందుకుంటున్న ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లిలో రూ.1.52 కోట్ల హాషిష్ ఆయిల్ రవాణా కేసును ఛేదించినందుకుగాను పోచంపల్లి ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డితో పాటు కానిస్టేబుల్స్ ముత్తయ్య, శ్రీనివాస్‌లు మంగళవారం హైదరాబాద్‌లోని రాచకొండ సీపీ కార్యాలయంలో సీపీ సుధీర్ బాబు చేతుల మీదుగా రివార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో చౌటుప్పల్‌రూరల్ సీఐ రాములు, పోలీస్‌సిబ్బంది ఎ ఉన్నారు.

యాదగిరిగుట్ట ఏడీఏగా శాంతి నిర్మల



యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట డివిజన్ ఏడీఏగా వి. శాంతి నిర్మల మంగళవారం వ్యవసాయ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల చేపట్టిన బదీలలో భాగంగా మిర్యాలగూడ ఎస్‌టీఎల్‌లో విధులు నిర్వహిస్తున్న శాంతి నిర్మల యాదగిరిగుట్టకు బదిలీపై వచ్చారు. ఆమెను ఏఓ సుధారాణి, ఏఈఓలు శాలువాతో సత్కరించారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

భువనగిరి క్రైం : భువనగిరికి చెందిన షేక్ మదార్ ఇటీవల భువనగిరి నుంచి హన్మాపురం వెళ్తుండగా తన మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. భువనగిరిలోని అర్బన్ కాలనీలో అద్దెకు ఉంటున్న మహేష్ అనంతారం గ్రామానికి బైక్‌పై వెళ్లి వస్తుండగా ఫోన్ జారిపడిపోయింది. బాధితులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మొబైల్స్ వివరాలు సిఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఐఎంఈఐ నంబర్స్ ఆధారంగా మొబైల్స్‌ని కనిపెట్టిని మంగళవారం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ బాధితులకు అప్పగించారు. వెంట కానిస్టేబుల్ జి.చెన్న కేశవులు ఉన్నారు.

ముంపు బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

భువనగిరి రూరల్ : బస్వాపురం ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న తమకు నష్టపరిహారం చెల్లించాలని తిమ్మాపురం భూ నిర్వాసితులు మంగళవారం జాతీయ ఎస్టీ కమిషన్ జాటోతు హుస్సేన్‌కు వినతిపత్రం సమర్పించారు. ముంపునకు గురవుతున్న పట్టా, సీలింగ్, ఎక్సెస్ భూములకు పూర్తి నష్టపరిహారం ఇప్పించాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఆర్ అడ్ ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఎద్ల సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఉడుత అంజనేయులు, రాజు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం





మోత్కూరు - రాజన్నగూడెం గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

సాక్షి ఎఫెక్ట్..

మోత్కూరు : మోత్కూరు నుంచి రాజన్నగూడెం గ్రామం వరకు అర్ధంతరంగా నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. రూ.5.80కోట్లతో చేపట్టిన పనులు నిలిచిపోవడంతో గత నెల 28న 'ఓ వైపు కంకర.. మరో వైపు బురద' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పలుమార్లు ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తేవడంతో పనులు ప్రారంభించాడు. ఈ పనులను ఆర్ అండ్‌బీ ఈఈ బాలప్రసాద్, డీఈఈ సురేందర్ కుమార్, ఏఈ మెంట స్వామి పర్యవేక్షించారు.

పకడ్బందీగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న అదనపు సీడీపీవో రమా

భువనగిరిటౌన్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని పకడ్బందీగా పంపిణీ చేయాలని అదనపు సీడీపీఓ రమా అన్నారు. పౌష్టికాహారం పంపిణీపై మంగళవారం భువనగిరి పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో అంగన్‌వాడీ ఆయాలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం పంపిణీ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చివరి మజిలీ కష్టాలు

- మోత్కూరులో చివరి దశలో నిలిచిన వైకుంఠధామం నిర్మాణ పనులు
- నిధుల కొరతే కారణం
- దహన సంస్కారాలకు ఇబ్బందులు



మోత్కూరు వైకుంఠధామం

మోత్కూరు : మోత్కూరు పట్టణ ప్రజల చివరి మజిలీ కష్టాలు తీరడం లేదు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో చేపట్టిన వైకుంఠధామం నిర్మాణ పనులు చివరి దశలో అర్ధంతరంగా నిలిచిపోయాయి. మున్సిపల్ కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో బిక్కేరు చెంతన 245 సర్వే నంబర్‌లోని 2-26 ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుత శ్మశాన వాటిక దశాబ్దాల కాలంగా కొనసాగుతుంది. ఇదే స్థలంలో నూతన వైకుంఠధామం నిర్మాణం చేయాలని మున్సిపల్ పాలకవర్గం తీర్మానించింది. దీంతో వైకుంఠధామం నిర్మాణం కోసం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ స్టేట్ గ్రాంట్ క్రింద రూ.కోటి నిధులను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసింది. వైఎంఆర్ ప్రాజెక్టు వైకుంఠధామం టెండర్ దక్కించుకుంది. 2022 జనవరి నెలలో వైకుంఠధామం నిర్మాణ పనులను సదరు కాంట్రాక్టర్ చేపట్టారు. టెండర్ అగ్రిమెంట్ ప్రకారం 6 నెలల్లో నిర్మాణం పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ నిర్మాణ పనులు పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

తొలుత త్వరితగతిన

కొన్ని నెలలు వైకుంఠధామంలో వివిధ రకాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేశారు. స్నానాల గదులు, స్టోర్ రూమ్, విజిటర్స్ షెడ్స్, పూజా మండపం, దింపుడు కళ్లెం, ప్రహరీ, డ్రెస్సింగ్ రూమ్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఆఫీస్ రూమ్, బర్నింగ్ రూమ్, శానిటేషన్, పంబ్లింగ్, టాయిలెట్స్, ఎలక్ట్రికల్స్ లాంటి పనులు చివరి దశలో నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకున్నా 75 శాతం పనులు పూర్తి చేయించాడు. అప్పటి ప్రభుత్వం మరో రెండు సంవత్సరాల పాటు అగ్రిమెంట్ కాలాన్ని పొడిగించింది. నిధుల కొరతతో వైకుంఠధామం నిర్మాణం పనులు ఏడాది కాలంగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. పార్కు, గేట్లు, ఓవర్ హెడ్ ట్యాంకు, ఆర్చి, శివుడి విగ్రహం ఏర్పాటు పనులు పూర్తి కాలేదు. చివరి దశలో వైకుంఠధామం నిర్మాణ పనులు నిలిచి పోవడంతో దహన సంస్కారాల కోసం ప్రజలు బిక్కేరు వాగును ఆశ్రయిస్తున్నారు. కొంత మంది ప్రజలు అసౌకర్యాల నడుమనే నిర్మాణంలో ఉన్న వైకుంఠధామంలోనే కొనసాగిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం అసంపూర్తిగా ఉన్న వైకుంఠదామం నిర్మాణం పనులను పూర్తయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరగా పూర్తి చేయించాలి



వైకుంఠధామం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయించాలి. వసతులు లేక మృతుల కుటుంబాలు, బంధువులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించి అసంపూర్తి పనులు పూర్తయ్యే విధంగా చూడాలి.

– పోచం సోమయ్య

బిల్లులు రాక పనులు ఆపేశారు



బిల్లులు రాక కాంట్రాక్టర్ వైకుంఠధామం నిర్మాణ పనులు నిలిపివేశాడు. 90శాతం పనులు పూర్తయినా కాంట్రాక్టర్‌కు డబ్బులు విడుదల చేయలేదు. దీంతో చివరి దశ పనులు నిలిచిపోయాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాను.

– శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్

భక్తిశ్రద్ధలతో మంగళగౌరీ వ్రతాలు



సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని శ్రీ మార్కండేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ మాసం మంగళవారాన్ని పురస్కరించుకొని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భకితశ్రద్ధలతో సామూహిక మంగళ గౌరీ వ్రతాలను ఆచరించారు. ఈ సందర్భంగా బండారి(పసుపు)తో గౌరీదేవి ప్రతిమను తయారు చేసి అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ముత్తైదువులకు వాయినాలు సమర్పించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ సీత సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు భారత అంజనేయులు, అంకం యాదగిరి, ఇంజమూరి యాదగిరి, గుర్రం కృష్ణ, ధర్మకర్తలు ఆటిపాముల నాగేశ్, యతీనందం, వనం కృష్ణ, చిక్క వెంకటేశ్, పెండెం పాండు, జిట్ట చంద్రమౌళి, నక్క రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ మనోహర్

మోటకొండూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అడిషనల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో ఓపీ, ఇన్ పేషెంట్ సేవలు, ల్యాబ్, ఫార్మసీ, టీబీసేవలు, ఆస్పత్రి శానిటేషన్ తదితర రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ శివాని, సబ్ యూనిట్ ఆఫీసర్ మల్లికార్జున్, హెచ్‌ఈఓ నరసింహ, ఎంఎల్‌హెచ్‌పీ పార్వతమ్మ, ల్యాబ్ టెక్నీషిన్ సునీత, ఫార్మసిస్ట్ మమత, సిబ్బంది సైదులు, అంజయ్య, సందీప్, జయమ్మ పాల్గొన్నారు.

అధికారుల హామీతో రిలే నిరాహార దీక్ష విరమణ



దీక్ష చేస్తున్న వారితో మాట్లాడుతున్న అధికారులు

రామన్నపేట : మునిపంపుల-లక్ష్మాపురం గ్రామాల మధ్య బీటీరోడ్డు నిర్మించాలని సీపీఎం గ్రామశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను మంగళవారం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల హామీతో విరమించారు. పీఆర్ డీఈ ఎ.శ్రీనివాస్, ఏఈ బి.గాలయ్య దీక్షా శిబిరాన్ని సందర్శించి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. మొదటి ప్రాధాన్యతగా బీటీరోడ్డు నిర్మాణానికి రూ.ఐదుకోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, జంపాల అండాలు, కల్లూరి నాగేష్, తొల్పునూరి శ్రీనివాస్, ఉంద్రాతి నర్సింహ, ఎండీ మైనొద్దీన్, గునుగంట్ల సత్యనారాయణ, తాళ్లపల్లి జితేందర్ జంపాల ఉమాపతి, తొల్పునూరి చంద్రశేఖర్, బూడిద భిక్షం, పులిపలుపుల నాగార్జున పాల్గొన్నారు.

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీకి యత్నం

ఆలేరు రూరల్ : గుర్తుతెలియని వ్యక్తి మహిళ మెడలో పుస్తెలతాడును చోరీ చేసేందుకు యత్నించాడు. ఈ ఘటన ఆలేరులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన పవిత్ర రైల్వే గేటు సమీపంలో కూరగాయల వ్యాపారం చేస్తోంది. రాత్రి 9:30 గంటల ప్రాంతంలో దుకాణం మూసివేసి ఇంటికి బయలుదేరింది. ఆమె రైల్వేగేటు దాటుతుండగా గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి వచ్చి పవిత్ర మెడలోని పుస్తెల తాడును తెంపుకుని పారిపోయాడు. బాధితురాలు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు దుండగుడిని వెంబడించగా పుస్తెలతాడును వదిలేసి పారిపోయాడు. బాధితురాలి సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పుస్తెలతాడును రికవరీ చేసి బాధితురాలికి అప్పగించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

'వికసిత్ భారత్' బీజేపీ లక్ష్యం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి

చౌటుప్పల్ : 'వికసిత్ భారత్' బీజేపీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యశాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 2న ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభ్యత్వ స్వీకరణతో దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బీజేపీ సభ్యత్వం 18కోట్లు ఉందని, ఈసారి 25కోట్లకు చేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌లో పండుగ వాతావరణంలో సభ్యత్వ నమోదు చేపట్టాలని కోరారు. బీజేపీ మున్సిపల్, మండల అధ్యక్షులు కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకని మల్లేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, యాదాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, కార్యదర్శి ఆలె చిరంజీవి, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, దాసోజు భిక్షమాచారి, కైరంకొండ అశోక్, కట్ట కృష్ణ, మిర్యాల రవి, రాధారపు సత్తయ్య, బుద్ధ సురేష్, గజం ఆనంద్, కడవేరు పాండు, నల్ల శివప్రసాద్, కాయితి ముత్యాలు, శివకుమార్, బొంగు పాండు, స్వామి, శ్రీశైలం, కొండల్, భానుప్రకాష్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15న పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఎన్నికలు



మాట్లాడుతున్న పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఎన్నికలు సెప్టెంబర్ 15న నిర్వహిస్తున్నట్లు పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు తెలిపారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి లో జరిగిన సమావేశంలో ఎన్నికల నిర్వహణకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సెప్టెంబర్ 5న నామినేషన్ల స్వీకరణ, మధ్యాహ్నం స్క్రూట్నీ, 6న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. 16న ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. అధ్యక్ష స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు రూ.2,500లు, డైరెక్టర్ స్థానానికి రూ.1,000 నామినేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో చేనేత నాయకులు చిట్టిపోలు శ్రీనివాస్, భారత లవకుమార్, భోగ నర్సింహ, అంకం మురళి, సంగెం చంద్రయ్య, గంజి అంజయ్య, గుండు పాండు, కర్నాటి అంజమ్మ, చేనేత నాయకులు సూరెపల్లి రవి, రాపోలు శ్రీనివాస్, ఏలే భిక్షపతి, చింతకింది రమేశ్, చిక్క కృష్ణ, గోలి యాదగిరి, శ్రీహరి, శశికళ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో 'ఉపాధి' అక్రమాలు బహిర్గతం

- కొలతలు, మస్టర్లలో తేడాల గుర్తింపు
- రూ.1.47లక్షల దుర్వినియోగం



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

వలిగొండ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం సామాజిక తనిఖీల్లో బహిర్గతమైంది. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజావేదిక ద్వారా సామాజిక తనిఖీ బృందం, విజిలెన్స్ అధికారులు మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో 14 వ విడతలో చేపట్టిన ఉపాధి పనులపై ఈ నెల 13 నుంచి 28వ తేదీ వరకు సోషల్ ఆడిట్ బృందం సభ్యులు గ్రామాల్లో పర్యటించి చేసిన పనులను పరిశీలించి కూలీలను స్వయంగా కలిసి రూపొందించిన రిపోర్టును ప్రజావేదికలో బహిర్గతం చేశారు. ఈ సామాజిక తనిఖీల్లో కొలతల్లో తేడాలతోపాటు మస్టర్లలో తేడాలను గుర్తించారు. మండల వ్యాప్తంగా సుమారుగా రూ.1,47,517 ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించి బాధ్యతలను సక్రమంగా నిర్వహించని సిబ్బందికి షోకాజు నోటీసులు ఇచ్చారు. ప్రజా ధనాన్ని రికవరీ చేయనున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అదనపు జిల్లా అభివృద్ధి అధికారి సురేష్, జిల్లా విజిలెన్స్ అధికారి ఉపేందర్ రెడ్డి, ఎంపీడీఓ జితేందర్ రెడ్డి, ఏపీఓ పరుశురాం, రిసోర్స్ పర్సన్స్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలి

చౌటుప్పల్ రూరల్: రానున్న స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ శ్రేణులు సిద్ధం కావాలని చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జైకేసారం, ఎస్.లింగోటం, కుంట్లగూడెం గ్రామాల్లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రైతులకు రుణామాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయడానికి కార్యకర్తలు శక్తివంచన లేకుండా పని చేయాలని కోరారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ చిలుకూరు ప్రభాకర్‌రెడ్డి, ఎన్నికల సమన్వయ కర్త పబ్బు రాజు, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, వెల్గ రాజశేఖర్‌రెడ్డి, జీంద్రు అంజిరెడ్డి, ఢిల్లీ చంద్రకళ, శేఖర్ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు అండగా ఉంటాం

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు

భువనగిరి రూరల్, యాదగిరిగుట్ట రూరల్: ముంపు బాధితులకు అండగా ఉంటామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ అన్నారు. మంగళవారం బస్వాపురం, లప్పానాయక్ తండా కట్టుడాలు పరిశీలించారు. అనంతనం ముంపు గ్రామమైన లప్పానాయక్ తండా గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. బస్వాపురం రిజర్వాయర్‌లో ఎంత కోల్పోయారు, ఎంత పరిహారం వచ్చింది అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. పునరావస పనులు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వివరాలను ఆరా తీసారు. బాధితులకు త్వరితగతిన పునరావాసం ఏర్పాటు చేసేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ, ఆర్డీఓ అమరేందర్, ఎమ్మార్వో వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నవీన్ కుమార్, ఏపీఓ నారాయణ, బీజేపీ ఎస్టీ మోర్చా మాజీ అధ్యక్షుడు భూక్య నరేష్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అజ్మెర కిషన్, శంకర్ నాయక్, బిచ్చా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న నాయకులు

మోత్కూరు : మోత్కూరులోని గాంధీనగర్ కాలనీకి చెందిన నకిరేకంటి నరేష్ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఏఈఈగా, మెంట నరేష్ గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌లో ఏహెచ్‌గా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వారిని యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మెంట నగేష్ ఆధ్వర్యంలో మంగళవారం రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అవిశెట్టి అవిలుమల్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దళిత నాయకులు మెంట నర్సింహ్మ, కూరెళ్ల యాదయ్య, మెంట స్వామి, పల్లె నవీన్, మేడె నవీన్, ఎం.డి.మోయిస్, మెంట మణి, మెంట చందు, నల్ల సాగర్, కూరెళ్ల సతీష్, దేశపాక శివ పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

భూదాన్‌పోచంపల్లి : పెండింగ్‌లో ఉన్న రూ.82వేల కోట్ల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఎస్ఎఫ్‌ఐ కేంద్రకమిటీ సభ్యురాలు మేడబోయిన మమత కోరారు. మంగళవారం ప్రభుత్వ విద్య పరిరక్షణ, సంక్షేమ హాస్టల్ సంరక్షణ సమరభేరి సైకిల్‌యాత్ర మంగళవారం భూదాన్‌పోచంపల్లికి చేరుకొంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్, మెస్ ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, రాజు, వేముల నాగరాజు, రాహుల్, గంగదేవి సాయినాథ్, పవన్, శ్రీనివాస్, కార్తీక్, పరమేశ్, మహేశ్, నరేందర్, సాయి పాల్గొన్నారు.

జనరల్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

బొమ్మలరామారం : విద్యార్థుల సౌకర్యార్థం మండల కేంద్రాల్లో జనరల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివాజీ లావుడ్యా రాజు అన్నారు. ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. కార్యక్రమంలో జగన్ నాయక్, వెంకటేష్,భరత్, శ్రీకాంత్, వేణు, చరణ్, అవినాష్, శివ, సందీప్,శ్రీధర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

మోత్కూరు : అర్హులైన రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ పథకాన్ని వర్తింపజేయాలని, రైతు భరోసా రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 29న మోత్కూరు తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏక కాలంలోనే రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని గద్దెనెక్కాక అనేక కొర్రీలు పెడుతోందని విమర్శించారు. రుణమాఫీ కాని రైతులు ధర్నాలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం)మండలంలోని కొరటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు వెంకన్న మాట్లాడుతూ పాఠశాల పదవ తరగతి 2003-04 బ్యాచ్ విద్యార్థులు రూ. 5వేల విలుగవల గుర్తింపు కార్డులను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, వర ప్రసాద్, శ్రీనువాసచారి, అనురాధ, వెంకటేశం పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం కింద 2020వ సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న వారు ఆ దరఖాస్తుతో పాటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, జిరాక్స్ కాపీలు మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని కమిషనర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఓపెన్ ప్లాట్‌కు రూ.1000, లే అవుట్‌కు రూ.10 వేలు కట్టి దరఖాస్తు చేసుకున్న వారి స్థలాను పరిశీలన చేయవలసి ఉందని తెలిపారు.

సబ్‌సెంటర్‌ను సందర్శించిన ఇంచార్జి డీఎంహెచ్ఓ

ఆలేరురూరల్ : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇంచార్జీ డీఎంఎచ్ఓ యశోధ అన్నారు. మంగళవారం ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని పీహెచ్‌సీ సబ్ సెంటర్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఫీవర్ సర్వే చేపట్టి అవసరమైన మందులు అందజేయాలని ఆశాకార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పెద్ద లక్ష్మి, యాదయ్య, సరేష్ పాల్గొన్నారు.

కార్మికులను మోసగిస్తున్న సర్కార్

భువనగిరిటౌన్ : ప్రజా పాలన పేరుతో కార్మిక వర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు నుంచి వస్తున్న పథకాలను సంక్రమంగా అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో కూరెల్ల నరసింహ, శ్రీనివాస్, శివకుమార్, మారయ్య, యల్లయ్య, చంద్రయ్య పాల్గొన్నారు

తాత్కాలిక నిర్మాణాలు తొలగించాలి

మోత్కూరు : మోత్కూరులో ఈ నెల 28న అంబేద్కర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్‌వరకు మురుగు కాల్వల నిర్మాణం పనులు ప్రారంభం కానున్నాయని, హీరో షోరూం వైపు 40ఫీట్ల లోపు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక నిర్మాణాలు, దుకాణాలను సంబంధితులు తొలగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రోడ్డు విస్తరణలో భాగంగా 40 ఫీట్ల లోపు ఉన్న నిర్మాణాలన్నీ తొలగించాలని కోరారు.

వ్యవసాయ క్షేత్రం సందర్శన

భువనగిరి రూరల్ : ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యునివర్సిటీ విద్యార్థులు మంగళవారం భువనగిరి మండలం కూనూరు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలు పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు.

పీహెచ్‌సీల్లో 12 రకాల వైద్య పరీక్షలు

భువనగిరి రూరల్ : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 12 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉండాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శిల్పిని ఆదేశించారు. భువనగిరి మండలంలోని బొల్లెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యులు మురళి, తులసి, ప్రీతి, కాంచన పాల్గొన్నారు.

మారథాన్‌లో ప్రతిభ



కిషన్‌ను అభినందిస్తున్న ఇంటెలిజెన్స్ డీజీపీ

వలిగొండ : హైదారాబాలో నిర్వహించిన మారథాన్‌లో వలిగొండ మండలం ప్రొద్దుటూరుకు చెందిన దుబ్బ కిషన్, నాగారం గ్రామానికి చెందిన కట్ట శేఖర్ పాల్గొని ప్రతిభ చూపారు.దుబ్బ కిషన్ 42 కిలో మీటర్ల మారథాన్‌లో పాల్గొని 4 గంటల 28 నిమిషాల్లో పూర్తి చేసిన ఇతను ప్రస్తుతం హైదారాబాద్‌లో ఇంటెలిజెన్స్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కట్ట శేఖర్ 21 కిలో మీటర్ల విభాగంలో పాల్గొని 2 గంటల 40 నిమిషాల్లో పరుగును పూర్తి చేశాడు. వీరికి ఇంటిలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి, హైదారాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి అభినందించారు.

బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

భువనగిరిటౌన్ : బీజేపీ ప్రభుత్వ హయాంలో మహిళకు రక్షణ కరువైందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. ఇటీవల కోల్‌కతాలో హత్యకు గురైన జూనియర్ డాక్టర్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భువనగిరిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే డాక్టర్ హత్యకు గురైందని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటయ్య రాములు శాంతమ్మ వరమ్మ సుజాత సుమీల పాల్గొన్నారు

దుండగులను కఠినంగా శిక్షించాలి

బొమ్మలరామారం : కోల్‌కతాలో డాక్టర్ హత్యకు కారకులైన దుండగులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు.ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ర్యాకల శ్రీశైలం, బాలయ్య, సత్తయ్య, మణెమ్మ, జయమ్మ, ఎల్లమ్మ, లక్ష్మి, పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం, దేవలమ్మ నాగారం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, వాటర్‌బాటిల్స్, స్కూల్‌బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి.నర్సింహ, కృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు మధుసూధన్‌రెడ్డి, శివజ్యోతి, దివీస్ ప్రతినిధులు గోపి, సాయికృష్ణ పాల్గొన్నారు.

శివకుమార్‌కు జాతీయ అవార్డు

భువనగిరి టౌన్: భువనగిరి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ నిర్వాహకులు బుషపాక శివకుమార్‌కు మదర్ థెరిసా జాతీయ అవార్డు దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతిలో హనుమంతరాయ గ్రంథాలయం, గాంధీనగర్‌లో మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాది ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో ప్రతి యేడు వివిధ రంగాల్లో సేవలు అందించి వారికి మదర్ థెరిసా అవార్డులు ప్రదానం చేస్తారు. భువనగిరికి చెందిన సేవా హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి శివకుమార్‌కు మంగళవారం అవార్డును ప్రదానం చేశారు.

చెరుకు స్వామి మరణం పార్టీకి తీరని లోటు



నివాళులర్పిస్తున్న డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి తదితరులు

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు చెరుకు స్వామి మరణం పార్టీకి తీరనిలోటని డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్ రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం అనారోగ్యంతో మృతిచెందిన చెరుకు స్వామి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వారిలో కాంగ్రెస్‌పార్టీ పట్టణ కార్యదర్శి బండారు ప్రకాశ్‌రెడ్డి, నాయకులు రావుల జంగయ్య, మర్రి బుచ్చిరెడ్డి, బోయపల్లి మల్లారెడ్డి, టింగిల్‌కార్ వెంకటేశం, బద్దం నర్సింహ, రావుల అనిల్, ఏనుగు మహిపాల్‌రెడ్డి, బద్దం రాజేశ్వర్, వనం వెంకటేశ్, కొండల్‌రెడ్డి, పోషయ్య, జినుకల కుమార్ ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

మండలంలోని భీమనపల్లికి చెందిన గూని రాములమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. దుర్గకమిటీ నాయకులు మృతురాలి కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.